క్లుప్తంగా

27న నిరసన ర్యాలీ



వీరఘట్టం: ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వం, అధికారం చేపట్టాక ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఈ మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 27న పాలకొండలో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. పెరిగిన విద్యుత్ బిల్లులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ర్యాలీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి బాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ తదితర పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో జై గురుదత్త హోమం, శ్రీచక్రార్చనలు, మహలింగార్చనలు చేపట్టారు. పార్వతీపురం, వీరఘట్టం, కాటందొరవలస, అంటిపేట, మక్కువ, మునిగూడ ప్రాంతాల భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్న భక్తులకు అన్నదానం చేశారు.

కార్మికులను ఆదుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, జాతీయ ఆరోగ్య మిషన్ కార్మికులు, మెప్మా సిబ్బందికి జీవనభృతి కల్పించాలని కోరారు. బడ్జెట్‌లో నిధులు పెంచి వారికి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు.

ఆందోళన ..



సీతంపేట మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల వద్ద విద్యార్థినుల తల్లిదండ్రులు ఆదివారం ఆందోళన చేపట్టారు. తమ పిల్లలను చూసేందుకు వచ్చిన తమను పాఠశాలలోకి అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాకమిటీ చైర్‌పర్సన్ అయిన తనను కూడా అనుమతించలేదని సుమలత వాపోయారు. బాలికల యోగ క్షేమాలు తెలుసుకుని వారికి అవసరమయ్యే సామగ్రి ఇచ్చేందుకు కూడా అనుమతించక పోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై గిరిజన సంక్షేమ శాఖ డీఈ అన్నదొర వద్ద ప్రస్తావించగా..విద్యార్థులతో తల్లిదండ్రులను మాట్లాడించామని చెప్పారు.

– సీతంపేట



పాలకొండ రూరల్: చినమంగళాపురం ఆర్‌సీఎం చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆకట్టుకున్న వేషధారణలు



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేటలో సెమీ క్రిస్మస్ సందడి



గరుగుబిల్లి: రావుపల్లిలో ముస్తాబైన చర్చి



వీరఘట్టం: మేలుకొలుపులో పాల్గొన్న భక్తులు



పాలకొండ రూరల్: చినమంగళాపురంలో క్రీస్తు ఆరాధన గీతాలకు నృత్యం చేస్తున్న యువత



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేటలో క్రిస్మస్ కేరల్స్ నిర్వహిస్తున్న మతవిశ్వాసకులు

క్రిస్మస్ సందడి

వాడవాడలా క్రిస్మస్ సందడి నెలకొంది. సెమీక్రిస్మస్, ఐక్య క్రిస్మస్, యూత్ క్రిస్మస్‌ల పేరిట వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. డిసెంబరు 25న క్రీస్తు జన్మదినం పురస్కరించుకుని, శాంతి, త్యాగానికి ప్రతీకగా ఏటా ఈ క్రిస్మస్ పండగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్రామగ్రామాన అందంగా ముస్తాబైన చర్చిలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కొన్నిచోట్ల జరుగుతున్న ప్రార్థనల్లో జీసస్ సందేశాన్ని మతబోధకులు వివరిస్తున్నారు. సత్యం, శాంతి, త్యాగం, ప్రేమ, కరుణ, దయ.. సందేశంతో ఏసుక్రీస్తు ఈ లోకానికి సరికొత్త మార్గం చూపారని, లోక రక్షకుడిగా కీర్తించే క్రీస్తు జననం ప్రపంచానికి పర్వదినమన్నారు. కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న సాంస్కృతిక ప్రదర్శనలు అలరిస్తున్నాయి.

–పాలకొండ, కురుపాం



వీరఘట్టం: విద్యుత్ కాంతులతో సీబీఎం చర్చి



గుమ్మలక్ష్మీపురం: పాములగీసాడలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మెరుగైన సదుపాయాలు కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలో సదుపాయాలు మెరుగుపరచాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు కోరారు. ఆ పాఠశాలను ఆదివారం సందర్శించిన ఆయన.. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ లేదని, ఆర్వో ప్లాంట్ పాడైందని తెలుపగా, ఆయా సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. అలాగే విద్యార్థిపై భౌతికదాడికి దిగిన తోట యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పాలకొండ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని రుషి యోగాకేంద్రం గురూజీ ధనుంజయ తెలిపారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోటదుర్గమ్మ ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఒత్తిడి కలిగిన జీవితంలో యోగా అత్యంత అవసరమని తెలిపారు. మానసిక ఒత్తిడిని తట్టుకుని ఆరోగ్యంగా జీవించడానికి యోగా ప్రధానమన్నారు.

మన్యంలో పర్యాటకుల సందడి

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని పలు పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. అడ్వంచర్ పార్కులో వివిధ సాహస క్రీడల్లో పాల్గొన్నారు. జలవిహార్‌లో బోటుషికారు, హ్యాంగింగ్ బ్రిడ్జిపై సందడి చేశారు. అలాగే మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. అడలి వ్యూ పాయింట్‌ను సందర్శించి ఏజెన్సీ అందాలు చూశారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని, ఏటా ఈ గణిత దినోత్సవం నిర్వహిస్తుండడం గమనార్హం కాగా కార్యక్రమంలో పాల్గొన్న వారంతా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. రామానుజన్.. గణితంలో అసంఖ్యాక ఆవిష్కరణలు చేసి దేశం గర్వించదగ్గ మేధావిగా పేరొందారని ప్రధానోపాధ్యాయుడు శంకరరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకుల జగదీశ్వరరావు, సంతోష్‌కుమార్ పండా, బరాటం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.